# ప్రొద్దుటూరులో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలోని నడింపల్లెలో టీడీపీ ఇంచార్జి జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. మూడున్నరేళ్ల గా రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరన్నారు. ఇలాంటి పరిస్థితులలో టీడీపీ ని ఆశీర్వదించి చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రి ని చేసుకోవడం ఒక్కటే మార్గమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.ఎస్ ముక్తియార్ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ముల్లా అలీబేగ్ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ టిడిపి వార్డు ఇన్‌చార్జులు సింగనమల బాబయ్య కదిరి బాబయ్య మేల బాబయ్య నడింపల్లి దస్తగిరి మెరువ మూర్తి పెన్నా నగర్ మజీద్ మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖాజీపేటలో తూనికలు మరియు కొలతల శాఖ ఆకస్మిక తనిఖీ



ఖాజీపేట, ఫిబ్రవరి 23

ప్రభాతవార్త :

ఖాజీపేటలో తూనికలు కోలతల శాఖ అధికారి రమేష్ కుమార్ రెడ్డి ఆకస్మా త్ తనిఖీలు నిర్వహించాడు. ఖాజీపేట లో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాల పైన తనిఖీలు నిర్వహించి సరైన కొలతలు ఉన్నాయా లేవా డిజిటల్ కాటాల తో పాటు రాళ్లకాటాలను కూడా పరిశీలించారు. తక్కువ తూకాలతో ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా దుకాణాల యజమానులను హెచ్చరించారు.

# వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలి

### ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

జిల్లాలోని వర్క్ బోర్డు ఆస్తులు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని కాపాడాలని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫు బోర్డ్ ఆస్తులను పరిరక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు వక్ఫ బోర్డు ఆస్తులను ఆక్రమించారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో కు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు జిల్లా వక్ఫుబోర్డు అధికారులకు ఎన్నోసార్లు ఆధారాలతో పాటు ఫిర్యాదు చేసినా స్పందించిన దాఖలాలు లేవన్నారు ప్రొద్దుటూరు పట్టణంలోని మోడం పల్లె మసీదు ఆస్తులకు సంబంధించి సుమారు 33 సెంట్లు ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డ్ ఆస్తులు కాపాడే అధికారి లేరా అని ప్రశ్నించారు. దీనికి సంబంధించి జాతీయ మైనారిటీ కమిషన్ కు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు ఇప్పటికైనా ఆస్తులను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు లేదంటే ఇన్సాఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు బాబా ఫక్రుద్దీన్ భాష పాల్గొన్నారు.

# ఉద్యోగుల సిపిఎస్ సొమ్మును చెల్లించాలి

### ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ప్రభుత్వం వాడుకున్న ఉద్యోగుల సిపిఎస్ సొమ్మును వెంటనే వడ్డీతో సహా చెల్లించాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. ఉద్యోగుల 11 నెలల వాటా సొమ్ము అయిన రూ.1320 కోట్లను ప్రభుత్వం వాడుకోవడం చాలా దారుణం అన్నారు. సిపిఎస్ పించను పథకంలో ఉద్యోగులు 10% వాటా చెల్లిస్తే ప్రభుత్వం మరో 10% వాటా కలిపి ఉద్యోగుల ప్రాన్ ఖాతాకు జమ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే గత 11 నెలలుగా ప్రభుత్వం తన వాటాను చెల్లించకపోవడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన పది శాతం వాటాను కూడా చెల్లించడం లేదన్నారు. ఇప్పటికే పెండింగ్ డి ఏ బకాయిలు చెల్లించకనే ఆదాయ పన్ను నుండి మినహాయించారని, మరి ఈ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే ఎన్నో రాష్ట్రాలు సిపిఎస్ రద్దు చేసి పాత పింఛన్ పథకం అమలు చేస్తుండగా మన రాష్ట్రంలో సిపిఎస్ సొమ్మునే ప్రభుత్వం వాడుకుంటోందంటే ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్రంలో సిపిఎస్ రద్దు చేసి ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు.

## అప్పర్ భద్రను ఆపాలంటూ 25 నుంచి పాదయాత్ర

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

అపర భద్ర ప్రాజెక్టు వ్యతిరేకిస్తూ రాజోలు బండ డైవర్షన్ స్కీమ్ నుండి ఆదోని వరకు మూడు రోజులపాటు 25 నుండి 28వరకు మూడు రోజులు పాదయాత్ర నిర్వహిస్తూ ఉన్నామని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తుంగభద్ర డాం పైన భద్ర నది మీద కేంద్ర ప్రభుత్వం కర్ణాటక ఎలక్షన్లు లక్ష్యంగా 5500 కోట్లు కేటాయించిందని, సి డబ్ల్యు సి ఫైనల్ గేజిట్ లో లేకుండా ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం దారుణమని, రాయలసీమలోని హెచ్ ఎల్ సి, ఎల్ఎల్సీ,కేసీ కెనాల్ కు ఉద్దేశించిన 30 టీఎంసీలను దోచుకునే విధంగా ఈ ప్రాజెక్టు ఉందని తక్షణం ఈ ప్రాజెక్టును ఆపాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మితమం అయితే రాయలసీమ ఎడారిగా మిగిలిపోక తప్పదని. ఇప్పటికే తుంగభద్ర డ్యాములో పూడిక పేరుకొని నీళ్లు తగ్గిపోయి ఉన్నాయని , రాయలసీమకు అన్యాయం జరగబోతూ ఉందని ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే రామచల్లు



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు వివరస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించడమే గడప గడపకు మన ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంకు నుండి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి రాజారామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొనగా, మరో వైపు ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి రాచమల్లు రమాదేవి పలువురు వైసీపీ మహిళా నాయకురాల్లు తన వెంటరాగా లింగాపురం గ్రామం బాలాజీ నగర్ మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాల అమలులో వైసీపీ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతోందని, కావున ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకునివెళ్ళి వారికి పథకాలపై అవగాహన కల్పిస్తూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని బలపరచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, ఎంపీపీ శేఖర్ యాదవ్, యువ నాయకులు కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, నాటక అకాడమీ డైరెక్టర్ బండారు సూర్యనారాయణ, వైసీపీ సీనియర్ నాయకుడు కాకర్ల నాగశేషా రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల సర్వసభ్య సమావేశం



మైదుకూరు, ఫిబ్రవరి 23

ప్రభాతవార్త :

మైదుకూరు మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండలములోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ లు పాల్గొన్నారు.ఏ పి వో లక్ష్మి నారాయణ మాట్లాడుతూ మండలం లోని మొత్తం 4833 కుటుంబాలు పనిలో పాల్గొన్నారని 2,31, 000 వేల పని దినాలు కల్పించామని ఇందుకు గాను 8.20 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ సమావేశంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ రఘురామి రెడ్డి, ఎంపీడీవో కులయమ్మ. ఎమ్మార్వో అనురాధ, సింగల్ విండో ప్రెసిడెంట్ మూలే సుధాకర్ రెడ్డి, అన్ని పంచాయతీల సర్పంచులు. ఎంపీటీసీ లు పాల్గొన్నారు.

## వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులుగా మద్దూరి లక్ష్మీదేవి



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

వైయస్సార్ జిల్లా వైసీపీ చేనేత విభాగం అధ్యక్షులుగా ప్రొద్దుటూరుకు చెందిన మద్దూరి లక్ష్మీదేవిని వైసిపి నియమించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నేతృత్వంలో ఆమె కృషి చేశారు అందుకు తగ్గట్టుగా కేంద్ర పార్టీ కార్యాలయం గుర్తించి ఆమెకు సముచిత స్థానం కల్పించారు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

# ఆల్‌షిఫా కేంద్రంలో పండ్లు పంపిణీ



కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 23,

ప్రభాతవార్త:

పాత రిమ్స్‌లో ఉన్న ఆల్‌షిఫా కేంద్రంలో సంధ్యా సర్కిల్‌లో ఉన్న ఏఐటీయూసీ యూనియన్ తోపుడు బండ్ల వ్యాపారస్థులు రాము, మగ్బూల్, పెద్ద రాము, మస్తాన్‌లు గురువారం మానసిక దివ్యాంగ పిల్లలందరికీ ద్రాక్ష, ఆపిల్, జామ కాయలు, అరటి పండ్లను నాయకులు ఆర్.బాబు, నాగిరెడ్డి, జోకుల సుబ్బరాయుడు సహకారంతో పండ్ల పంపిణీ చేశారు. ఆర్.బాబు మాట్లాడుతూ చిరు వ్యాపారస్థులు దివ్యాంగులకు సేవ చేయడం ఎంతో హర్షించదగ్గ విషయం. రాబోయే రోజుల్లో పండ్ల వ్యాపారస్తులు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్‌షిఫా వ్యవస్థాపకులు ఎస్.మహ్మద్ రఫీ మాట్లాడుతూ ఏఐటీయూసీ నాయకులు ఆర్.బాబు, మిత్ర బృందం, చిరు పండ్ల వ్యాపారస్థులకు మానసిక దివ్యాంగుల పట్ల అవగాహన కలిగించి మా కేంద్రం నందుకు తీసుకువచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రాణాలు పణంగా పెట్టడం అంటే ఇదే!



కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

ప్రాణాలు పణంగా పెట్టి వీధుల్లో ప్రజలకు వెలుగులు నింపుతున్న నగరపాలక సంస్థ విద్యుత్తు ఉద్యోగులు నగరంలోని ఏదో ఒక డివిజన్‌లో ఏదో ఒక చోట ప్రమాదం అని తెలిసినా బతుకు బండి లాగడానికి ఇలాంటి జిమ్మిక్కులు చేయాల్సిందే. తమ జీవితాలు చీకటి మయమైనా ప్రజలకు వెలుగు అందిస్తున్న ఈ కార్మికులకు కనీస వేతనాలు లేకపోవడం బాధాకరమైన విషయం. ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు వీరిపై దృష్టి సారించి కనీస వేతనాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మార్చి 18న ప్రత్యేక లోక్ అదాలత్

కడప లీగల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

మార్చి 18వ తేదీన జరగనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను వినియోగించుకొని సత్వరం న్యాయం పొందాలని కక్షిదారులకు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మరియు ఎఫ్ఏసీ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.ఎన్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి ఎస్.కవితలు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మార్చి 18న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌లో కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు, వినియోగదారులకు సంబంధించిన కేసులు, ఐపీఆర్ కేసులను మాత్రమే రాజీ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కొరకు 08562-258622, 244622 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

## మాజీ సర్పంచ్ మృతిపట్ల ఎమ్మెల్యే సంతాపం



రామాపురం .ఫిబ్రవరి23 ప్రభాతవార్త

మండలంలోని సుద్దమల్ల గ్రామం బయారెడ్డిగారిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ గడికోట బయారెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. బయారెడ్డి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అతని కుమారులు యోగాంజులురెడ్డి, కమలాస్‌లను శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. వారితో వైఎస్సార్‌సిపి నాయకులు మాజీ ఎంపిపి జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ భూషణ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, మల్‌రెడ్డి, భాస ్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణా విద్యార్థుల ప్రతిభ



రాయచోటి టౌన్ .ఫిబ్రవరి23

ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా, కడప జిల్లాల నారాయణ విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్స్ ప్రోగ్రాంలో రాయచోటి నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.విజ్ఞశ్రీ. జి.నేహా, ఎస్ ఆశీన్ రేష్మాలు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం చెన్నకేశవరాజు మాట్లాడుతూ విద్యార్థులలో ప్రపంచంలోనే వివిధ దేశాలు, వారి సాంప్రదాయాలు, కట్టుబాట్లు గురించి అవగాహన పరచడమే ఈ ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖాదర్‌వలి, ఆర్ఐ శంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# 25న పోలేరమ్మ జాతర



గాలివీడు .ఫిబ్రవరి23

ప్రభాతవార్త

మండల కేంద్రంలోని పూసలపేట, శెట్టివారిపల్లిలో వెలసిన శ్రీ పోలేరమ్మ తల్లి జాతర 25, 26వ తేదీ శని, ఆదివారాలలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు కోర్కెలు తీరుస్తూ కొంగుబంగారంగా వెలసిన శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా శనివారం నాడు రాత్రి చక్క భజనలు, ఛాందినీ బండ్లతో గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహించబడనున్నారు. ఆదివారం ఉదయం మహిళలు బోనాలు రూపంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. కావునా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

# అన్ని దానాల్లో అన్నదానం మహాదానం



వీరబల్లి .ఫిబ్రవరి23 ప్రభాతవార్త

అన్ని దానాలలో అన్నదానం మహాదానమని సంగంవారిపల్లి మాజీ సర్పంచ్ తుమ్మగింజల వెంకటరమణ, ఆలయ చైర్మన్ రామక్రిష్ణమరాజు పేర్కొన్నారు. గురువారం షిర్డీసాయి మందిరంలో ప్రతి గురువారం జరిగే అన్నదానం సందర్భంగా రాగిమాను దిన్నెపల్లెకు చెందిన సాయిరాం ఫైర్ వర్క్స్ యజమాని ఆంజనేయులు, ఓబులమ్మ దంపతులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమం ఎంతో శుభపరిణామం అన్నారు. దాత ఆంజనేయులు మాట్లాడుతూ తమ కూతురు ఈక్షిత సాయి నామకరణం సందర ంగా అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. మాజీ సర్పంచ్ వెంకరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార ్యక్రమంలో వీఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి, పూ జారి రాఘవేంద్రస్వామి, సాయి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మా తాతల కాలం నుండి అనుభవంలో ఉన్న భూమిని వేరే వాళ్లకు పట్టా ఎలా ఇస్తారు

### - రెవెన్యూ అధికారులను నిలదీసిన నక్కావాండ్లపల్లె నాయీ బ్రాహ్మణులు



రాయచోటి రూరల్, ఫిబ్రవరి 23,

ప్రభాతవార్త:

ఒక సంవత్సరం.. రెండు సంవత్సరాలు కాదు.. 70 సంవత్సరాలుగా మా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని కొంత మంది బడా బాబులు కుట్ర పన్ని అక్రమంగా కాజేయాలని చూస్తున్నారంటూ రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లెకు చెందిన నాయీ బ్రాహ్మణ కుటుంబాలు తమ గోడును వెల్లబోసుకుంటున్నాయి. ఎవరో చిత్తూరు జిల్లాకు చెందిన మిలటరీ వ్యక్తి రెవెన్యూ అధికారులను భూమిని పట్టా ఇచ్చారంటూ అదేకనుక నిజమైతే మా కుటుంబాలకు ఆ భూమి తప్ప వేరే ఏమీ ఆధారం లేదని మాకు ఆత్మహత్యలే శరణ్యమంటూ వారు తమ ఆవేదను వినిపించారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు సమీపంలో నాయీ బ్రాహ్మణుల అనుభవంలో ఉన్న పట్టా భూమిని అక్రమంగా పట్టా పొందిన మిలిటరీ వ్యక్తి మహేశ్వర్‌రెడ్డి భూమి కొలత వేసేందుకు ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకున్న నాయీ బ్రాహ్మణులు పొలం వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. పొలానికి హద్దులు చూపేందుకు వచ్చిన రాయచోటి తహసీల్దారు కార్యాలయం సర్వేను నాయీ బ్రాహ్మణులు నిలదీశారు. మా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న మా భూమిని ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గత ఏడాది క్రితం పట్టా సర్వే నెంబరు 2051 4.93 ఎకరాలు భూమిని తమకు రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారంటూ చెప్పారు. దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లిలో నివాసం ఉంటున్న నాయీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కుటాలు వారసులుగా ఉన్న దేవపట్ల మనోహర్, దేవపట్ల సిద్దమ్మ, దేవపట్ల భయమ్మ, శ్రీనివాసులు, మోతాది వెంకటరమణ, దేవపట్ల కుమార్, దేవపట్ల సుమలత, భువనేశ్వరిలు తమ గోడును విన్నవించారు.

# 6వ వార్డులో ఇదేం కర్మ కార్యక్రమం..



జమ్మలమడుగు, ఫిబ్రవరి 23,

ప్రభాతవార్త:

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట (6వ వార్డులో) ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆయన చౌడేశ్వరీ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఈ ప్రభుత్వం మధ్య, పేద తరగతి ప్రజలను పెడుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించి పూర్వ వైభవం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, తిరుమలదాస్, గురుకుమార్, బాల పుల్లారెడ్డి, బ్రదర్స్ శ్రీధర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజశేఖర్, శంకర్‌రెడ్డి, కుళాయప్ప, కృష్ణారెడ్డి, కుళ్లాయిరెడ్డి, వెంకట కృష్ణయ్య, చంద్రమోహన్, ఓబులేసు, సుబ్బరాయుడు, వల్లీ, హుసేన్, నరసయ్య, పుల్లయ్య, బాలాజీ, తెదేపా నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి జీపీఎఫ్ ఖాతాలు తెరవాలి



జమ్మలమడుగు, ఫిబ్రవరి 23,

ప్రభాతవార్త:

మున్సిపల్ సిబ్బందికి జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు అన్నారు. గురువారం జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ సిబ్బంది సమస్యల పట్ల తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపించారు. మున్సిపల్ సమ్మె జరిగి 7 మాసాలైనా మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు ఒక్కటీ పరిష్కరించలేదని పైపెచ్చు నెల నెలా వేతనాలు సకాలంలో విడుదల చేయడం లేదన్నారు. ఎన్ని ఒత్తిల్లు వచ్చినా తట్టుకొని చిత్తశుద్ధితో పని చేసే ఉద్యోగులను శత్రువుల్లా చూడడం తగదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు సత్వరం విడుదల చేయాలని లేనిపక్షంలో పెండౌన్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు తారక రామారావు, జమ్మలమడుగు మున్సిపల్ కన్వీనర్ స్వర్ణలత, ప్రసాద్, మహేష్, వెంకట సుబ్బమ్మలు పాల్గొన్నారు.

# విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి



పోరుమామిళ్ళ రూరల్, ఫిబ్రవరి 23

ప్రభాతవార్త :

పోరుమామిళ్ల మండలం దమ్మనపల్లె గ్రామానికి చెందిన సుమలత(28)అనే వివాహిత విద్యుత్ షాక్ తగలడంతో మృతి చెందింది. నీటిని వేడి చేసేందుకు హీటర్ పెడుతున్న నేపథ్యంలో హీటర్ చేతికి తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం వారి పిల్లలను ఆదుకోవాలని పలువురు కోరారు.

# బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



పోరుమామిళ్ళ రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇత్రంపేట నందు గల జడ్పీ హైస్కూల్ నందు దాదాపు 120 మంది విద్యార్థులకు ఉచితంగా రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి పర్యవేక్షణలో నిర్వహించారు. డాక్టర్ గారు మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్ యొక్క రకాలు వాటి యొక్క ప్రాముఖ్యత అలాగే విద్యార్థుల యొక్క ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల అధ్యాపకులు విజయబాబు. జేమ్స్, పెంచలయ్య మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ట్రస్టు సభ్యులు బండి వెంకటసుబ్బయ్య వసంత రాయలు శ్రీధరు నాని సురేష్ పాల్గొన్నారు.

# బహిరంగ వేలం..

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు ఆర్టీవో కార్యా లయంలో గురువారం 19 తుక్కు వాహనాలకు బహిరంగ వేలాన్ని ఆర్టీవో సుశీల నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం ద్వారా రూ.1.50లక్షలు రవాణా శాఖకు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో కరీముల్లా, నారాయణ నాయక్, వేణు, ఎంఐ లక్ష్మీకర్, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో పేదలకు మెరుగైన వైద్యం..



కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యానికి పెద్ద పీట వేసిందని వైకాపా జిల్లా వైద్య విభాగం అధ్యక్షులు డా.ఐ.శివా నాయక్ అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తోందని కొనియాడారు. గురువారం వైకాపా జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ నాయక్ మాట్లాడుతూ జిల్లా వైద్య విభాగ అధ్యక్షులుగా నాకు అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి అంజాద్‌బాషా, ఎంపీ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఛైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీకి క్రమశిక్షణగా పని చేస్తానని తెలిపారు. పార్టీ నిర్దేశించిన అన్ని కార్యక్రమాల్లో పాలు పంచుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.పుత్తా సతీష్‌రెడ్డి, జగన్ నాయక్, అప్ప నాయక్, సోమా నాయక్, అనిల్ నాయక్, పవన్ నాయక్ పాల్గొన్నారు.

## సీనియర్ క్రీడాకారుడు డా॥ కొండారెడ్డి మృతి తీరని లోటు



బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని కొండారెడ్డి వీధిలో నివాసం ఉండే ప్రముఖ హోమియో వైద్యుడు మరియు కడప జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ మాజీ ఈసి మెంబర్, సీనియర్ క్రీడాకారుడు డా॥ కొండారెడ్డి (48) బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమార్తె, కుమారుడు కలరు. డా॥ కొండారెడ్డి అనేక సంవత్సరాలుగా బద్వేలు పట్టణంలో క్రీడలలో ఎంతో మందికి గురువుగా నిలిచి షటిల్ క్రీడాకారుడిగా జిల్లా స్థాయిలో అనేక అవార్డులు కూడా పొందిన వ్యక్తిగా నిలిచారు. సీనియర్ క్రీడాకారుడు డా॥ కొండారెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న పలువురు క్రీడాకారులు, నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. షటిల్ కోచ్ కనుమర్లపూటి రామయ్య, కోచ్ మహేష్, సీనియర్ క్రీడాకారులు శివ, రవి, చక్రి, మధు, పీరయ్యతో పాటు పలువురు క్రీడాకారులు మృతుడు డా॥ కొండారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంచితనానికి మారుపేరుగా నిలిచి ఎంతో మందికి యువతకు శిక్షణ ద్వారా క్రీడలలో రాణించే విధంగా కృషి చేసిన డా॥ కొండారెడ్డి మృతి తీరని లోటు అని వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని పలువురు క్రీడాకారులు ఆకాంక్షించారు.

## వైసీపీ జిల్లా వాణ్యి విభాగం అధ్యక్షుడికి సన్మానం

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



మిట్టా కరుణాకర్‌ను సన్మానిస్తున్న వైస్ ఛైర్మెన్ సాయికృష్ణ, కౌన్సిలర్ వెంకటేశ్వర్లు.

వైఎస్సార్ సీపీ కడప జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులుగా నియమితులైన మిట్టా కరుణాకర్‌ను గురువారం మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణ, 9వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలాగే ఏపీ ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ గుబ్బా చంద్రశేఖర్‌ను సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన మిట్టా కరుణాకర్ సేవలను గుర్తించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వారికి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులుగా నియమించడం సంతోషకరం అని మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణ, 9వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు అన్నారు. అలాగే ఏపీ ఆర్యవైశ్య మహాసభ జిల్లా జనరల్ సెక్రటరీగా ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తూ పలువురి ఆర్యవైశ్యుల ఆదరాభిమానాలు పొందిన మిట్టా కరుణాకర్ ఇటువంటి పదవులు మరెన్నో అలంకరించాలన్నారు. అనంతరం పట్టణంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ, పత్తి సాయి పవన్, కృష్ణ కుమార్‌తో పాటు పలువురు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## 26న ఉచిత హోమియో ఆయుర్వేద వైద్య శిబిరం

### - ఆవోపా అధ్యక్షులు నూకల రెడ్డెయ్య

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 23

ప్రభాతవార్త :



మాట్లాడుతున్న ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు సముద్రాల మాధవీ లత.

బద్వేలు పట్టణంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం మరియు ఆవోపా కమిటీ ఆవోపా మహిళా విభాగ్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 26వ తారీఖున స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో ఉదయం 9 నుండి 12 గంటల వరకు కడప జిల్లా ఆవోపా ప్రెసిడెంట్ డా॥ మాలేపాటి వెంకటరామ్ సహకారంతో ఉచిత హోమియో ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ, ట్రెజరర్ చంద్రశేఖర్ మరియు ఆవోపా కమిటీ అధ్యక్షులు నూకల రెడ్డెయ్య, సెక్రటరి జొన్నలగడ్డ శ్రీధర్, ట్రెజరర్ పత్తి రాఘవేంద్రరావు, ఆవోపా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బచ్చు సురేష్ బాబు, పబ్బతి సత్యనారాయణ, గొల్లమందల వేణు, యల్లనూరు రమణతో పాటు ఆవోపా కమిటీ మహిళా విభాగ్ అధ్యక్షురాలు సముద్రాల మాధవీ లత, సెక్రటరి పెసల శ్రీవాణి, ట్రెజరర్ దరిశా సౌజన్యలు తెలిపారు. బద్వేలు పట్టణంలో ఆవోపా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత హోమియో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని వ్యాధులకు అవసరమైన ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కావున బద్వేలు ప్రాంత ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

# దుష్ప్రచారాలు మానుకోవాలి



కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 23,

ప్రభాతవార్త:

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డిపై టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని కడప మేయర్ కె.సురేష్‌బాబు మండిపడ్డారు. వారి అనుకూల ప్రచార మాధ్యమాల ద్వారా వ్యతిరేక ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వైఎస్.వివేకా పార్టీలో సముచిత స్థానం కల్పించి అందరం గౌరవించామన్నారు. గురువారం కడప అపూర్వ సమావేశ మందిరంలో పాత్రికేయులతో మేయర్ సురేష్‌బాబు, సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ పులి సునీల్‌కుమార్‌లు మాట్లాడుతూ వైఎస్.వివేకానందరెడ్డి 2018 ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముక్తకంఠంతో పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 2019 ఎన్నికల్లో అవినాష్‌రెడ్డి గెలుపు కోసం వైఎస్.వివేకా ప్రచారం నిర్వహించారని కూడా తెలిపారు. అటువంటి వివేకాను హత్య ఉదంతం అవినాష్‌రెడ్డికి టీడీపీ నాయకులు అంటగట్టడం దుర్మార్గమన్నారు. నిజానిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వాస్తవాలను వెలుగులోకి తేవాలని సీబీఐని కోరారు. దుష్ప్రచారం నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు సుబ్బారెడ్డి, ఎన్.నాగరాజు, జాషువా, సంపత్, షఫీ, బండి ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, ఆర్‌వీ రమణ, గోపాలకృష్ణ, చిన్నయ్య, లక్ష్మీనారాయణ, రామ్మోహన్‌రెడ్డి, రామ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## డీఎస్సీ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి



కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

ఏపీ సీఎం జగన్ కాలయాపన చేయడం తగదని డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులను వవెంటనే రెగ్యులర్ చేయాలని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులను వైఎస్ఆర్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో హామీ మేరకు వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఇంకా కేవలం ఏడాది కాలం మిగిలిందని, భవిష్యత్తు గురించి ఆలోచించడం మానేసి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం వల్ల మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తిగా సీఎం మిగులుతారన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి మాట నిలుపుకోవాలన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా వ్యవహరించండి

ఆర్డీఓ ఎంఎస్.మురళి

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. గురువారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 15పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటికి 8రూట్లుగా ఏర్పాటు చేసి 8మంది సెక్టోరియల్ అధికారులను నియమించామన్నారు. ఏడి, డిఈ క్యాడర్ ఉన్నవారికే ఈ బాధ్యతలు అప్పగించామన్నారు. పోలింగ్ నిర్వహణ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా తనిఖీ చేసి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళిలను ప్రతి అధికారి పాటించాలన్నారు.

# జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా అనీల్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



అన్నమయ్యజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ ఐ.అనీల్‌కుమార్‌రెడ్డిని నియామకం చేశారు. ఈ మేరకు గురువారం వైఎస్ఆర్ సిపి అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్లను ప్రకటించారు. ఇందులో మదనపల్లెకు చెందిన ప్రముఖ దంతవైద్యనిపుణులు డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డిని జిల్లా డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులుగా నియామకం చేస్తూ ఉత్తర్వులు అందచేశారు. తంబళ్ళపల్లె, మదనపల్లె రెండు నియోజకవర్గాల్లో డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డికి మంచిపేరు ఉంది. అంతేకాకుండా రాష్ట్ర అటవీశాఖ, భూగర్భగనుల విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా, తంబళ్ళపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వీరి కుటుంబం వైద్యవృత్తిలో పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవిర్భావం నుంచి డాక్టర్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. జిల్లా అధ్యక్షులుగా నియామకం పట్ల పలువురు ఆయనను అభినందించారు.

# వైఎస్ఆర్ సేవాదల్ అధ్యక్షులుగా పునిత్‌కుమార్

మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



అన్నమయ్యజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సేవాదల్ అధ్యక్షులుగా పునత్‌కుమార్‌ను నియమాకం చేశారు. ఈ మేరకు గురువారం పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. మదనపల్లెకు చెందిన పునిత్‌కుమార్ గత ఐదేళ్ళగా వైఎస్ఆర్ పార్టీకి విదేయులుగా ఉంటూ పార్టీ అభివృద్దికి కృషి చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపి మిథున్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు సన్నిహితునిగా ఉంటూ పార్టీ అభ్భిద్దికికృషి చేశారు. పునిత్ సేవలను గుర్తించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సేవాదల్ అధ్యక్షులుగా నియామకం చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



వేర్వేరుచోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టు వారిపల్లెకు చెందిన అశ్విత్ (32) చేనేత కార్మికుడు బుధవారం రాత్రి సొంత పనులపై ద్విచక్రవాహనంలో చేలూరుకు బయలుదేరాడు. దారిలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. నిమ్మనపల్లె మండలం తురకపల్లెకు చెందిన బాబ్‌జాన్(26) భవన నిర్మాణ కార్మికుడు ఈ నేపథ్యంలో టూవీలర్‌కు పెట్రోల్ పట్టుకునేందుకు గురువారం మండలంలోని కందురురోడ్డులో వెలుతుండగా దారిలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాం ఢీకొంది. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను స్థానికులు 108 వాహనాల్లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# పార్టీ అభివృద్ధి కోసం పాటుపడతాం

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని వైఎస్ఆర్ టీయూసీ జిల్లా అధ్యక్షులు మల్లూరు జాషువా, నగర అధ్యక్షులు ఎ1 అంబులెన్స్ ఎస్.నాగరాజులు పేర్కొన్నారు. అలాగే పార్టీ అభివృద్ధి కోసం పాటుపడతామని తెలిపారు. గురువారం కడప మేయర్ కె.సురేష్‌బాబును శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ టీయూసీ జిల్లా అధ్యక్షునిగా, నగర అధ్యక్షులుగా మాకు అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి అంజాద్‌బాషా, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షుడు మేయర్ సురేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో క్రమశిక్షణతో మెలుగుతామన్నారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు పాలుపంచుకుంటామని తెలిపారు.

# చదిపిరాళ్ల గ్రామ పంచాయతీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి..

కమలాపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పుత్తా నం ిసింహారెడ్డి ఆదేశాల మేరకు గురువారం కమలాపురం మండలం చదిపిరాళ్ల గ్రామ పంచాయతీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి జగన్ ప్రభుత్వంలో చదిపిరాళ్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభిప్రాయాలు తెలుసుకొని పార్టీ ఇచ్చిన అభిప్రాయ సేకరణ పత్రంలో వివరాలు సేకరించారు. పార్టీ నిర్దేశించిన ఫోన్ నంబరు 9261292612కి మిస్డ్‌కాల్ ఇవ్వమని, రాబోయే ఎన్నికల్లో తెదేపాకు ఓట్లు వేసి పుత్తా నరసింహారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, అంకిరెడ్డి, రైతు నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, యువత నాయకులు ఎర్రబల్లి చిన్న సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, నియోజకవర్గ కాపు నాయకులు దాది రామయ్య, చెన్నకృష్ణారెడ్డి, శంకర్ యాదవ్, ఐటీడీపీ నరసింహ పాల్గొన్నారు.

# పాలీసెట్ ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తులు ఆహ్వానం

కమలాపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

కమలాపురం నియోజకవర్గంలోని పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులందరూ పాలీసెట్ 2023 ప్రవేశ పరీక్ష కొరకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.బి.వెంకటేశ్వర్లు కోరారు. పాలిటెక్నిక్ విద్య ద్వారా నైపుణ్య సామర్థ్యాలు మెరుగుపడి విద్యార్థులకు పరిశ్రమల్లో త్వరగా ఉద్యోగాలు లభిస్తాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలను సందర్శించాలని తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష రుసుం రూ.2400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.2100 నిర్దేశించడం జరిగిందని ఆయన తెలిపారు.

# శ్రీజ్ఞానాంబిక డిగ్రీ విద్యార్థులు 95మంది క్యాంపస్ సెలెక్షన్‌కు ఎంపిక

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో గురువారం టెక్‌మహేంద్రా చెన్నై వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 95మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ విద్యార్థులు బిజినెస్‌ప్రాజెస్ఎగ్జిక్యూటీవ్ కోసం ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సర వేతనం రూ.2.5లక్షలు ఇవ్వనున్నట్లు కంపెనీ హెచ్ఆర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, ప్లేస్‌మెంటు ఆఫీసర్ మహేష్, అధ్యాపకులు అభినందించారు.

# మార్కెట్‌యార్డు స్థలపరిశీలన

చీఫ్ ఇంజనీర్ ఎం.శ్రీనివాస్

కురబలకోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



అంగళ్ళు వ్యవసాయ మార్కెట్ కమిటీకి కేటాయించిన స్థలాన్ని గురువారం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమటీ ఛీఫ్ ఇంజనీర్ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. అంగళ్ళు వ్యవసాయ మార్కెట్ కమిటీకి కురబలకోట ఆర్ఓబి వద్ద రెవెన్యూ అధికారులు కేటాయించిన 20ఎకరాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 10ఎకరాల్ల మొదటి విడతగా అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. ఆర్ఓబి వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీకి కేటాయించిన 20ఎకరాలను దశలవారీగా పనులు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. ఆయన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ డిఆర్.ఉమాపతి అక్కడ త్వరితగతిన పనులు చేపడితే మార్కెట్ అభివృద్ధి చెందడమే కాకుండా ప్రభుత్వానికి లక్షలాది రుపాయలు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఆయన వెంట ఈఈ కె.వెంకటరావు,జేడి రామాంజులు, ఏడి త్యాగరాజు, ఏఈ సంపత్‌కుమార్‌లు కలరు.

# మిట్స్ విద్యార్థికి ప్రతిభా స్కాలర్‌షిప్

కురబలకోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



మిట్స్ కళాశాలకుచెందిన బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుపేంద్రరెడ్డికి టాటా క్యాపిటల్ పంక్‌స్కాలర్‌షిప్ మంజూరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత విద్యకు అభ్యసించేందుకు టాటా క్యాపిటల్ స్కాలర్‌షిఫ్ ప్రోగ్రామ్ కింద విద్యార్థికి రూ.50వేలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడి కీర్తి నాదేళ్ళ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

# సచివాలయాల అకస్మిక తనిఖీ చేసిన డిఎల్‌డివో

పెద్దమండ్యం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



మండలంలోని సచివాలయాల్లో సిబ్బందిపనితీరు సంక్షేమపథకాల అమలు, హౌసింగ్ పనితరుపై గురువారం డిఎల్‌డివో లక్ష్మిపతి తనిఖీనిర్వహించారు. ముసలి కుంట,బ్రదేవు సచివాలయాల సిబ్బంది ప్రవర్తనా పనితీరు,వారిహాజరు పట్టికలు,రికార్డులును పరిశీలించారు.గ్రామాల్లో సమస్యలపై దృష్టిపెట్టాలని వారి సమస్యలను పరిష్కరిచే విధంగా చర్యలుతీసుకోవాలని తెలిపారు.అలాగే హౌసింగ్ పనులు గురించి అరాతీశారు.పనులు ఎంతవరకూ వచ్చాయి,వారికి కావల్సి సదుపాయాలు నీటిపైపులు,కరెంటుపోల్ల ఎర్పాటుపై అడిగి తెలుసు కున్నారు. హసింగ్‌పనులు జాప్యంలేకుండా త్వరగాపూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్, ఈవోఆర్డిజనార్దన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు దగ్గర నుంచి ధాన్యం, పప్పులు కొనుగోలు చేస్తాం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః



రైతుల వద్ద నుంచి ధాన్యం,పప్పులతో పాటు ఇతర తిను పదార్థాలను సేకరించనున్నామని అన్నమయ్య జిల్లా డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మండలం మహిళా సమైక్య కార్యాలయంలో మండల సమైక్య సిబ్బంది సీసీలు, సంఘమిత్రలు సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈసమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో చేయూత మహిళా మార్టు అనుబంధంగా ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నామన్నారు. ఈ సెంటర్‌లో ధాన్యం, పప్పులు మొదలగు వాటిని ప్రాసెస్ చేసి చేయూత మార్టులకు పంపిణీ చేయనున్నామన్నారు. మండలంలోని రైతుల వద్ద నుంచి ధాన్యం, పప్పులు తిను పదార్థాలను కొనుగోలుచేసి నాణ్యమైన వస్తువులను సరఫరా చేయడమే ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ల ధ్యేయమన్నారు చేయూత మార్టులను మరింత అభివద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మహిళలదేనన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు రూతు, వెంకటరమణ, జవహర్‌బాష, ఏపీఎం నరసింహులు, సీసీలు సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# రక్త హీనత రహిత రాష్ట్ర సాధనే లక్ష్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః



రక్తహీనత రహిత రాష్ట్ర సాధనే లక్ష్యమని రివైసీడ్ చైల్డ్ హెల్త్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయకుమార్ అన్నారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నగిరిమ దుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించి ఆరోగ్య సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. అలాగే గర్భిణీలకు ఆరోగ్య కేంద్రాల ద్వారా అందనున్న సేవలను సైతం తనిఖీచేసి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఓపీ వార్డులు, కాన్పుల శాతం, పారిశుద్ధ్యం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కీర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, ఏఎన్ఎంలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 26న మండల సర్వసభ్య సమావేశం

కెవిపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః

మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించబడునని ఈఓపీఆర్డీ లతీఫ్‌ఖాన్, తెలిపారు. ఈసమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచిలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

# వైఎస్సార్‌టీయూసీ అభివద్ధికి కృషి చేస్తా

పీలేరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః



వైఎస్సార్‌టీయూసీ అభివద్ధికి శాయ శక్తులా కషిచేస్తానని జిల్లా వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులుగా ఎన్నికైన చిన్నయల్లప్ప తెలిపారు. అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులుగా పదవి ఇచ్చిన రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, దైవ సమానులైన రాష్ట్ర మంత్రి వర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు పునూరు గౌతంరెడ్డి, వైఎస్సార్ అన్నమయ్య జిల్లా అధ క్షులు రాయచోటి శాసనసభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిలకు రుణపడి ఉంటారని వారి అడుగుజాడల్లో నడుచుకుంటూ వైఎస్సార్‌టీయూసీ అభివద్ధికి కషి చేస్తానని సవినయంగా మనవిచేస్తున్నానని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు చిన్నయల్లప్ప తెలిపారు.

# లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలి

నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కేవి.పల్లె ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః



తెదేపా జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్రను మార్చి 5వ తేదీన పీలేరులో జరిగే పాదయాత్రను , బహిరంగ సభను విజయవతం చేయాలని టీడీపీ జాతీయనేత నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కేవి.పల్లెలో తెదేపా కార్యాలయంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు రోజులుపాటు లోకేష్ పాదయాత్ర జరుగుతుందని మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన బూత్ కమిటీ సభ్యులు, నాయకులు వచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో శ్రీకాంత్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గం నల్లారి కుటుంబంతోనే అభివద్ధి చెందిందని అభివద్ధిని చూసి ప్రజలు సహకరించాలని కోరారు. కార్య క్రమంలో మండల తెదేపా మండల పార్టీ అధ్యక్షురాలు గీతమ్మ, నాయకులు శివారెడ్డి, నల్లపురెడ్డి సురేష్‌రెడ్డి, గాంధీరెడ్డి, రవీంద్రారెడ్డి, సుధాకర్‌నాయుడు, ఎంజీవి. రమణ, శంకర్‌రెడ్డి, ద్వారకనాధనాయుడు, వీరరాఘవులునాయుడు, బాబురెడ్డి, ధనుంజయ, వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు అగస్త్యేశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఆశయ కోసం కృషి చేయాలి

కలకడ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః



మండలంలో శ్రీనివాసరెడ్డి బిల్డింగ్ కార్యాలయం నందు గురువారం ఎంపీపీ శ్రీదేవి రవికుమార్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గహసారధులుకు అవగాహన సదసు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శాసనసభ్యు లు చింతల రామచంద్రారెడ్డి ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి , మైనారిటీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాథరెడ్డిలు హాజరై వారు మాట్లాడుతూ మన రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ రాష్ట్ర ప్రజలకోసం అహ ర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అంతేకాకుండా నవరత్నాల పథకాలతో పాటు ఎచివాలయ కార్యాలయాలను ఏర్పాటుచేయడం ఆకార్యాలయాలకు సిబ్బందిని నియమించడం లాంటి కార్యక్రమాలను ఏర్పాటుచేశారని అన్నారు. అంతేకాకుండా ప్రజల అభివద్ధి ఇంకా ముందుకు సాగడానికి సచివాలయ కన్వీనర్లును , గహసా రధులను నియమించడం జరిగిందని మనందరం కలిసి వైఎస్సార్ బలోపేతం ఏసి రాబోయే ఎన్నికలలో సీఎంజగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా అధికారంలోకి తీసుకురావడానికి మన మందరం కషచేయాలని తెలిపారు కార్యక్రమంలో కలకడ

# గుర్రంకొండ కొండను కాపాడిన ఫైర్ సిబ్బంది

గుర్రంకొండ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుర్రంకొండ కొండకు నిప్పు పెట్టడంతో సుమారు 10గంటల రాత్రిలో ఫైర్ సిబ్బంది అడవిని, విధ్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాపాడారు. కొండ కాలుతోందని మగ్గిరావాసులు ఎంపిటిసి ఖధీర్‌కు సమాచారమివ్వడంతో హుటాహుటిన ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో వెంటనే వచ్చి కాపాడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కొండకు ఆనుకొని వుండడంతో ప్రమాదం తప్పింది. అది వెయ్యి మెగావాట్ల విద్యుత్ కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. కొండతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వున్న ప్రాంతాన్ని ఫైర్ సిబ్బంది ఆర్పివేశారు. అడవులకు నిప్పు పెట్టడంతో కొన్ని ప్రాంతాలలో భారీ ప్రమాదాలు జరిగే ప్రమాదం వుంది కాబట్టి స్థానికులు ఎప్పటికప్పుడు కొత్త వ్యక్తులను గమనిస్తూ వుండాలని ఎంపిటిసి ఖధీర్ సూచించారు.కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ కిరణ్‌కుమార్, డిఒపి రాజ్‌కుమార్, భాస్కర్, శివశంకర్, నూర్, స్థానికులు తదితరులు వున్నారు.

# వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

కుటుంబ గొడవడలతో మనస్థాపం చెందిన ఓ వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. మదనపల్లె పట్టణంలోని బాబుకాలనీకి చెందిన ప్రశాంత్ భార్య నందిని(26) రుణదాతల వద్ద భారీగా అప్పులు చేసి పుట్టింటి వారికి ఇచ్చిందని ఈ విషయం ఇటీవల అత్తింటివారికి తెలియడంతో వారు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన ఈమె గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# జిల్లా ఎస్టీ అనుబంధ సంఘానికి వన్నె తెస్తా

– నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభివృద్ధిలో దూసుకుపోతున్నారని వైకాపా రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గానికి ఎస్టీ అనుబంధ సంఘ అధ్యక్షుడుగా నిరంతరం వైకాపా అభివృద్ధితో పాటు ప్రజా సేవలో పునీతులైన శ్రీనివాస్ నాయకులు ఎంపిక చేసినట్లు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ పార్టీకి నేను చేసిన కృషికి నియోజకవర్గం బాధ్యతలను తూచా తప్పకుండా పాటిస్తానని మంత్రి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కుటుంబానికి రుణ పడి ఉంటానని తెలిపారు. శ్రీనివాస్ నాయక్ ఎంపికపై ఆరు మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు ఘనంగా సన్మానించి వైకాపాలో ఎస్టీ సామాజిక వర్గ సమస్యలపై అలుపెరగని పోరాటం చేయాలని ఆకాంక్షించారు.

# యువగళాన్ని విజయవంతం చేద్దాం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః

తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దామని జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన తెదేపా కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మార్చి మాసంలో నియోజకవర్గంలో యువగళం లోకేష్ పాదయాత్ర జరగనున్న దష్ట్యా ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తెదేపా శ్రేణులంతా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. యువతకు రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు, నిజాయితీ రాజకీయాలే లక్ష్యంగా సాగనున్న పాదయాత్రను మనమంతా సమిష్టిగా విజయవంతం చేయాల్సిన అవసరం బాధ్యత ఉందన్నారు. గతంలో కూడా పూర్వపు పీలేరు, వాయల్పాడు నియోజకవర్గాలు రెండు తెదేపాకు కంచుకోటని రాబోవు ఎన్నికల్లో తెదేపా జెండా రెపరెపలాడటం ఖాయమన్నారు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను తెదేపా శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వైకాపా ఆగడాలు అన్యాయాలు ఎక్కువైపోయాయని, ప్రజల్లో వారిపై ఉన్న నమ్మకం కూడా పూర్తిగా పోయిందన్నారు. రాబోవు ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో తెదేపా ఘన విజయం సాధించి యువత, ప్రజల భవిష్యత్తుతో పాటు అభివద్ధి సంక్షేమం ధ్యేయంగా ప్రజా పాలన సాగబోతుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరమణ, మండల పార్టీ అధ క్షులు మల్లికార్జునరెడ్డి, కష్ణారెడ్డి, మాజీ విండో అధ్యక్షులు ద్వారకనాధరెడ్డి, తెదేపా నాయకులు శేషు, గాంధీపేట రమణ, రాజేంద్రాచారి, సయ్యద్‌బాషా, వెంకటేష్, ఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

# 40 శాతం రోడ్లు వేయగానే అభివృద్ధి చెందినట్లా!

రూ.130 కోట్లు నిధులు ఖర్చు చేసేదెన్నడు?

ఇప్పటికీ అధ్వాన్నంగా ఉన్న కొన్ని వార్డులు

– తెదేపా నాయకులు నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి

బద్వేలు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



బద్వేలులో నాలుగు వార్డుల్లో రోడ్లు వేసినంత మాత్రాన అభివృద్ధి చెందినట్లా అని, వైసీపీ నాయకులు ఆర్భాటం చేయడం ఎంత వరకు సమంజసం అని తెలుగుదేశం నాయకులు నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బద్వేలుకు వచ్చినపుడు ఎన్నికల దృష్ట్యా రూ.130 కోట్లు బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు విడుదల చేస్తే వాటిలో రూ.40 కోట్లు కూడా ఖర్చు చేయని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు కొన్ని వార్డులు మరీ దయనీయంగా ఉన్నాయని, రోడ్లు నాణ్యత లేకుండా వేయడం వలన బిల్లు రాకపోవడంతో మిగిలిన పనులు చేయకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఇప్పటికే రోడ్లల్లో నాణ్యత లేకుండా వేశారనే అపోహలు ఉండడమే గాక ఇంత వరకూ బిల్లులు కూడా చేయకపోవడానికి కారణం కూడా అదే అని, కానీ ప్రజా ప్రతినిధులు చేసే తప్పిదాలే నేడు ఇతర ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేరుకే మాత్రమే రూ.130 కోట్లు నిధులు అని ఆర్భాటంగా చెప్పుకోవడం తప్ప ఇంత వరకూ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని మండి పడ్డారు. అధికారులు చొరవచూపి మిగిలిన వార్డులలో కూడా రోడ్లు వేయించేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవాలని నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి కోరారు.

# ప్రజా ఉద్యమాలను ఆదరించండి, బలపరచండి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ సీపీఎంను ఆదరించాలని సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జమ్మలమడుగులో ప్రజా ఉద్యమ విరాళాలను ప్రజల వద్ద తిరిగి సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ పేదలకు అండగా నిలుస్తున్న సీపీఎం పార్టీ అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి కార్పొరేట్ శక్తులు అయిన అంబానీ, ఆదానీలకు దోచి పెడుతోందని ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలని సూచించారు. ఏపీ రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం నినదిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, సీపీఎం నాయకులు సంజీవ్ రాయుడు, శ్రీను, గోపీ, రాజేష్, కృష్ణ పాల్గొన్నారు.

# మరో జ్యోతిరావుపూలే సీఎం వైఎస్ జగన్

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :



బడుగు బలహీన వర్గాలకు, వారి అభ్యున్నతికి పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ కొనియాడారు. గతంలో బడుగు, బలహీన వర్గాల కోసం జ్యోతిరావుపూలే పోరాడారని, నేడు వారి కోసం పోరాడుతున్న మరో జ్యోతిరావుపూలే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాలు ప్రకటిస్తే అందులో 11 స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించడం గొప్ప విషయం అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే ఇప్పటివరకు తెలియని బీసీ కులాలు బయటకు తీశారని, నేడు చట్టసభల్లో మనకు తెలియని బీసీ కులాల నుండి అడుగు పెడుతున్నాన్నారు. ఇదంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషే అన్నారు. బడుగు, బలహీన వర్గాల మహిళలకు ప్రముఖ ఆదరణ కల్పించిన ఏకైక ప్రభుత్వం వైకాపా అన్నారు. నూర్‌బాషా సంఘం నాయకుడు రఫీ మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసి బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో టీడీపీ బీసీలకు మోసం చేస్తే, సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, బీసీ జిల్లా కార్యద్శి రాజేష్‌నాయుడు, తాలూకా కార్యదర్శి దువ్వూరు సంపత్, నాయీ బ్రాహ్మణ కార్యదర్శి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం

– ములకల చెరువు సీఐ సాదిక్ అలీ

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె చిత్తూరు ఉమ్మడి ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల్లో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి కృషి చేస్తామని ములకల చెరువు సీఐ సాదిక్ అలీ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఎన్నికల అధికారి ఎంఈవో త్యాగరాజు తంబళ్లపల్లె సర్కిల్ పరిధిలోని 301 పోలింగ్ స్టేషన్‌లో ఎస్సైలు, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరపడానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్సై మల్లికార్జునరెడ్డి, పోలీసు సిబ్బంది, ఎన్నికల అధికారి తదితరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె కోర్టు న్యాయమూర్తిగా ఉమర్ ఫరాఖ్

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె అదనపు జూనియర్ సివిల్ జడ్జీగా ఉమర్ ఫరాఖ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లికి చెందిన సివిల్ జడ్జీ ఆసిఫా సుల్తానా తంబళ్లపల్లె కోర్టులో గత కొంత కాలంగా ఇన్‌ఛార్జి న్యాయమూర్తిగా పని చేసేవారు పుట్టపర్తి జిల్లా ధర్మవరం కోర్టులో పని చేసే న్యాయమూర్తి ఉమర్ ఫరాఖ్ గురువారం కోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఉమర్ ఫరాఖ్‌ను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ములకల చెరువు సీఐ సాదక్ అలీ, ఎస్సై మల్లికార్జునరెడ్డిలు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

## మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రం తనిఖీ

– రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి

కమలాపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు శనగలు కొనుగోలులో నిబంధనలు సడలించాలని ఆయనకు విన్నవించడంతో ఉన్నతాధికారులతో, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లికి బోనాలు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:





మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లికి గురువారం అనంతపురం గ్రామం చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు అమ్మవారికి జాతర మరుసటి దినం రోజున బోనాలు సమర్పించారు. ఆనవాయితీగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాజా భజంత్రీలతో అమ్మవారి గుడి చుట్టూ తిరిగి బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాల పండగ జరుపుకుంటారు. వచ్చిన భక్తులకు ఆదిమూలం చిన్నప్ప వంశీయులు అమ్మవారిని దర్శనాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో రవీంద్రరాజు, ఛైర్మన్ నరసింహారెడ్డిలో గ్రామస్థులకు ఏర్పాటు చేశారు.

## సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు : ఎంపిడివో

–52 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీషులు

గాలివీడు .ఫిబ్రవరి23 ప్రభాతవార్త



విధి నిర్వహణలో సమయపాలను పాటించకపోతే చర్యలు తప్పవని షోకాన్ నోటీష్‌లు అందుకున్న సచివాలయం సిబ్బందిని ఉద్దేశించి ఎంపిడివో శేఖర్ నాయక్ హెచ్చరించరారు. గురువారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో సమయపాలన పాటించని సచివాలయం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలోని 16 గ్రామ సచివాలయంలు పరిధిలో దాదాపు 15 గ్రామ సచివాలయాల్లో కొందరు సిబ్బంది సమయపాలన పాటించలేదన్న కారణంతో 52 మందికి ఫిబ్రవరి 3వ తేదీన షోకాజ్ నోటీసులు అందజేశామన్నారు. అయితే వీరిలో 16 మంది మినహా మిగతా సిబ్బంది కనీసం సంజాయిషీ కూడా ఇవ్వకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. దీంతో ఆగ్రహించిన ఎంపిడివో తిరిగి ఫిబ్రవరి 23వ తేదీ గురువారం మిగిలిన 36 మందికి రెండవ మారు షోకాజ్ నోటీసులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నోటీసులు అందుకున్న సిబ్బంది సరైన కారణాలతో శుక్రవారం లోపు సంజాయిషీ ఇవ్వనియెడల ఫిబ్రవరి నెల జీతం నిలుపుదలతో పాటు క్రమశిక్షణ చర్యలు కొరకు జిల్లా అధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

## పీలేరుకు పదవుల పంట

పీలేరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః



పీలేరు నియోజకవర్గ పరిధిలోని అన్ని విభాగాల ట్రేడ్ యూనియన్ల వైఎస్సార్ పార్టీ కోసం నిరంతరం కషిచేస్తూ పార్టీ అభివద్దికి పాటుపడుతున్న పలువురికి పీలేరు నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ విభాగాలకు జిల్లా పదవులు వరించాయి. వివరాలలోకి వెలితే పీలేరు పట్టణానికి చెందిన ముస్లీం మైనారిటీ నాయకులు స్థానిక సర్పంచి డాక్టర్ హబీబ్ బాషాకు జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులుగా, పీలేరు మండల పరిధిలోని బాలంవారిపల్లెకు చెందిన చిన్న యల్లప్పకు వైఎస్సార్ పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా పట్టణానికి చెందిన మాజీ ఎంపీపీ మహితాఆనంద్‌కు వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా, నియమించడం పట్ల పీలేరు నియోజకవర్గంలోని అన్ని వర్గాలకు, అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదవులు రావడానికి కషిచేసిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హారీష్‌రెడ్డితో పాటు పలువురు సర్పంచిలు, జడ్పీటీసీలు, వైఎస్సార్ పార్టీ నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

## న్యాయవాదులకు ఇంటిస్థలాలు ఇవ్వాలి

లా సెక్రటరికి వినతి

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



రాజంపేట బార్‌అసోసియేషన్ నా యయవాదులకు ఇంటిస్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లా సెక్రటరి నయనాల జయసూర్యను బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు రఘునాథ్‌రెడ్డి, కృష్ణకుమార్‌లు కలిసి కోరారు. ఈ మేరకు లా సెక్రటరికి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు హైకోర్టు న్యాయమూర్తి డి.రమేష్, శ్యామ్ సుందర్, ఆలపాటి గిరిధర్‌లను కలిసి రాజంపేట కోర్టు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

## క్షయవ్యాధిగ్రస్తులకు చేయూత ఇవ్వండి

డాక్టర్ సృజన

నందలూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



ప్రధానమంత్రి టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా చికిత్సలో ఉన్న క్షయ రోగులకు నెల నెలా వారికి కావాల్సిన పౌష్టికాహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్షయరోగులను దత్తత తీసుకోవాలని నందలూరు టిబి యూనిట్ అధికారిని డాక్టర్ సృజన కోరారు. నందలూరు టిబి యూనిట్ పరిధిలోని నందలూరు, రాజంపేట, పెనగలూరు మండలాల పరిధిల్లో ప్రస్తుతం చికిత్సలో ఉన్న 150 మంది రోగులకు గాను 18 మందికి మాత్రమే దత్తత పూర్తి అయ్యారని ఇంకా చాలామంది పేద క్షయ రోగులకు ప్రభుత్వం ఉచిత మందులు, నెలకు 500 రూపాయలు సహాయం అందిస్తున్నామని, ప్రస్తుతం నెలకు సరిపడా పౌష్టికాహారం దాతలు సహకరిస్తే రోగులకు మెరుగైన వైద్యంతో పాటు త్వరగా కోలుకోవడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందలూరు మండల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి కడప జిల్లా క్షయ చికిత్స సమన్వయ కర్త నాగేంద్ర, నందలూరు టిబి యూనిట్ సూపర్‌వైజర్ జయప్రకాష్, నందలూరు ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణంపై సమీక్ష

దువ్వూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణంపై గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇందులో మండల ప్రత్యేక అధికారి అడా వైస్‌ఛైర్మన్ ఓబులేసునందన్ గ్రామ సచివాలయాల వారీగా గృహ నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. ప్రతి వారానికి లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాలకు బిల్లులు చెల్లించి వారు త్వరగా నిర్మించుకునేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రోత్సహించాలన్నారు.లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ గృహాలు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. చింతకుంట, దువ్వూరు, గుడిపాడు, ఎడమడక గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో వంద శాతం గృహాలు నిర్మించుకునేలా కృషి చేయాలన్నారు. ఇంకా ఎవరైనా గృహాలు కావాలంటే గృహ నిర్మాణశాఖలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవనాల పనులు కూడా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## జీవ రసాయనాల ఉత్పత్తులపై రైతులు అవగాహన పెంచాలి

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని ఎస్.ఉప్పరపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న రైతులతో సంబంధిత ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు తక్కువ ఖర్చుతో జీవ రసాయనాల ఉత్పత్తులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఉప్పరపల్లె సర్పంచ్ ఆనాల కవితా చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిమి సంహారక మందులు పంటలపై వాడకుండా జీవ రసాయనాలతోనే ఉత్పత్తులను పెంచి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశాలను సంబంధిత అనంతరాజుపేట ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తల సలహాలను పాటించాలని ఉమామహేశ్వరి తెలిపారు. ముఖ్యంగా పంటలకు పూర్తిస్థాయిలో క్రిమిసంహారక మందులు వాడకూడదని, దీనిపై నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను సంబంధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆనాల కవిత చెంగల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఆసియా, అసిస్టెంట్ డైరెక్టర్ కవిత, ఎఒ సుధాకర్, నియోజకవర్గ రైతు సలహామండలి చైర్మన్ వెంకటరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



మండలంలోని పెండ్లిమర్రి పీహెచ్‌సీని గురువారం ఉదయం 10 గంటలకు అడిషనల్ డీఎంహెచ్‌వో టీబీ, లెప్రసీ వైద్యులు డా.ఖాదర్ వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే టీబీపీ కేసులు చాలా తక్కువగా నమోదయ్యాయని వాటిని మరింత పెంచాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ఏ ఒక్క టీబీ కేసు మరిచిపోకుండా అందరినీ గుర్తించాలని మెడికల్ అధికారిని ఆదేశించారు. అలాగే ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రంపతాడు సచివాలయాన్ని పరిశీలించి అక్కడ ఓపీని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల బూత్‌ను పరిశీలించిన ఆర్‌డివో

చిన్నమండెం .ఫిబ్రవరి23 ప్రభాతవార్త



ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి చిన్నమండెం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను గురువారం ఆర్డివో రంగస్వామి, రాయచోటి రూరల్ సిఐ లింగప్ప లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయా అని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలపై సమీక్షించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :



పులివెందులలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల సొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పులివెందులలోని జగనన్న హౌసింగ్‌కాలనీలో గృహనిర్మాణ శాఖ అధికారులు, కదిరి మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, రీజనల్ మేనేజరు ఆరిఫ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పులివెందులలో సుమారు 250 ఎకరాలలో 7వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనాలు కల్పిస్తూ నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేసి జులై 6నాటికి పూర్తయ్యే విధంగా అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరే విధంగా పనిచేయాలన్నారు. అదే విధంగా ఇళ్ల నిర్మాణంలో, నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని, ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతను పాటించడానికి గ్రామ సచివాలయాల్లో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ సేవలను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలన అసమర్ధపాలన

– మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాలనను ఇంటికి సాగనంపాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుర్నూతల గ్రామంలో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. కుర్నూతులలో ప్రతి ఇంటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, అరాచకాలను గురించి ప్రజలకు వివరించారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో రాష్ట్రంలో సామాన్య ప్రజలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. రాష్ట్రంలో ఏ వర్గానికి ఎటువంటి ఉపయోగం లేకుండా పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని అందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలాడి ప్రభాకర్‌రెడ్డి, సిద్దక వెంకట రామిరెడ్డి, వాసుదేవరెడ్డి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిలో సామాజిక న్యాయం ఎక్కడ...?

–మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి టౌన్ .ఫిబ్రవరి23 ప్రభాతవార్త



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో సామాజిక న్యాయం కనుచూపుమేరలో కనిపించలేదని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రాయచోటి పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్కొక్క ఎమ్మెల్సీ అభ్యర్థి దగ్గర 20 కోట్ల రూపాయలు తీసుకుని పదవులు ఇవ్వడం వైసిపి ప్రభుత్వానికి అలవాటైపోయిందని అన్నారు. సామాజిక న్యాయం అంటే ఐదు ఆరు కులాల వారికి కాదు బలహీనవర్గాలలో చాలా కులాలు ఉన్నాయని అందరికి న్యాయం చేసినప్పుడే సామాజిక న్యాయం వర్తిస్తుందన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైసిపి ప్రభుత్వం, వైసిపి నాయకులకు సిబిఐ ఉచ్చు బిగుస్తుంటే దిక్కుతోచని స్థితిలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు దృష్టిని మళ్లించేందుకు విజయవాడలోని గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై వైసిపి రౌడీలు దాడి చేయడం, తేదేపా అధికార ప్రతినిధి పట్టాభితో సహా 11 మంది నాయకులపై గన్నవరం సిఐ కనకారావు ఇచ్చిన పిర్యాదు మేరకు అట్రాసిటి హత్యాయత్నం తదితర కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం చూస్తే వివేకా హత్య ఉందంతం ప్రజలను దారి మళ్లించడానికి ఎత్తుగడ వేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు అన్నింటిని తెలంగాణా ప్రాంతానికి చెందిన పొంగులేటి శ్రీనివాసులు రెడ్డికి అప్పజెప్పి ఆయన నుంచి జగన్‌మోహన్‌రెడ్డికి కోట్ల రూపాయలు కమీషన్‌లు అందుతున్నాయని రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో మైనింగ్ నుంచి సీనరీస్ చార్జీలు కూడా వైసిపి నాయకులు వసూలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలుస్తుందని రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు.

## రాష్ట్రం కోసం ఎంతో చేస్తున్న సిఎంకు ప్రజలు అండగా నిలబడాలి

ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త




రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో వినూత్న పథకాలు అమలు చేస్తూ నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలబడేలా ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కోరారు. గురువారం రాజంపేటలో మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, గృహసారధులు, వాలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో జడ్‌పి ఛైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో మరలా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా కష్టపడి పనిచేయాలని కోరారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావడం ద్వారా పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరు కష్టపడి పనిచేయాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి ఆశయాలను, ఉద్దేశ్యాన్ని, వైకాపా ప్రభుత్వ వినూత్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వైకాపా నేతలు ఆకేపాటి మురళి, యోగీశ్వర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, నాగా సుధాకర్‌రెడ్డి, పృద్దీపరెడ్డి, నాగా పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా మైనార్టీ అధ్యక్షుడిగా బేపారి మహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్ .ఫిబ్రవరి23 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడుగా రాయచోటి పట్టణంకు చెందిన బేపారి మహమ్మద్ ఖాన్‌ను వైసిపి పార్టీ కేంద్ర కార్యాలయం ఆయనను నియమించింది. ఈయన వైసిపికి అన్ని వేళలా అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి అహర్నిషలు శ్రమించారు. పార్టీ ఈయనను గుర్తించి మైనార్టీ విభాగం అధ్యక్షుడుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా బేపారి మహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజలు సమస్యలు పరిష్కారానికి ముఖ్యంగా ముస్లీం మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈయన నియామకం చేపట్టడంతో జిల్లాలోని పలువురు నేతలు ఆయనను దుశ్శాలవాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో షేక్ కరీముల్లా, షేక్ ఫయాజ్‌బాష, మున్సీపల్ వైస్ చైర్మన్ ఫయాజ్‌రెహామాన్, కౌన్సిలర్‌లు అన్నాసలీం, సాదత్, అలీ, ఆసీఫ్‌ఖాన్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్ కో ఆప్షన్ ఖాదర్‌లి తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాలు ఆకస్మిక తనిఖీ

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :




బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం అనంతరాజపురం రైతు భరోసా కేంద్రాన్ని సహాయ వ్యవసాయ సంచాలకులు డా॥ యం.నాగరాజ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలో క్రాప్ బుకింగ్, ఇ-పంట కొరకు అర్హులైన రైతులు నమోదు చేయించుకోవాలని, ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు నిర్దేశించడం జరిగిందని, ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు మరియు వ్యవసాయ సహాయకులు వారి పనితీరు సాధించిన ప్రగతి లక్ష్యాలు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించడం జరుగుతుందని, రైతులకు ఎరువులు, డ్రిప్ మరియు ప్రభుత్వ పథకాలు రైతులకు అందించాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. డా॥ వైఎస్సార్ పొలంబడి అమలు తీరును పరిశీలించి, ప్రతి రైతు భరోసా కేంద్రాలలో కనీసం 20 మెట్రిక్ టన్నులు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్‌లను గుర్తించి నిర్దేశిత ప్రొఫార్మాలో ఉంచాలని, కిసాన్ డ్రోన్స్‌పై విస్తృత ప్రచారం కలిగించాలని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు మాన్యం సిద్దారెడ్డి, రైతు భరోసా కేంద్ర మిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా శ్రీకాంత్ రెడ్డి

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



వైఎస్సార్ సీపీ కడప జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారు. గతంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా ఉంటూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఉన్నటువంటి నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సేవలను గుర్తించి వారిని జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా నియమించడం పట్ల గురువారం ఎంపీ అవినాష్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ, వైసీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యా రెడ్డితో పాటు పలువురు నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తెలియజేశారు. అనంతరం బద్వేలు మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, అడా ఛైర్మెన్ సింగసాని గురుమోహన్, స్టేట్ డైరెక్టర్లు సుందర రామిరెడ్డి, అల్లా బకాష్, బిజివేముల రామసుబ్బారెడ్డి, వంకెల పోలిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మల్లేశ్వర రెడ్డితో పాటు పలువురు నాయకులు శ్రీకాంత్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## పార్టీకోసం మరింత కష్టపడి పనిచేస్తాం

కడప, కార్పొరేషన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



రెండవ పర్యాయం వైకాపా జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నన్ను ఎన్నుకున్నందుకు సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డికి వీరబల్లి నాగేంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి అంజాద్ భాష, ఎంపీ వైయస్. అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి, వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు, మేయర్ సురేష్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో క్రమశిక్షణంతో మెలుగుతామన్నారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు పాలుపంచుకుంటామని, ప్రజల సమస్యల కోసం నిరంతరం పాటుపడతానని నాగేంద్ర తెలిపారు.

## ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో జీ20 సదస్సుపై అవగాహన




పీలేరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్తః

స్థానిక సంజయ్‌గాంధీ ప్రభు త్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో భారత దేశం అధ్యక్షతన నవంబర్‌లో నిర్వహించే జీ20 సదస్సు పై అవగాహన కార్యక్రమాన్ని జరి పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి ,బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు, రాష్ట్ర బీజేపీ ఇంటలెక్చువల్ సెల్ కార్యదర్శి సాయిలోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీ20 సదస్సు ఆవిర్భావ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ముఖ్య అతిధిగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఒకే భూమి, ఒకే కుటుంబం ఒకే భవి ష్యత్ అనే సదస్సు ఉద్దేశం గురించి తెలియజేశారు. ఈ మద్యకాలంలో ప్రపం చానికి భారతదేశం ఆపన్నాహస్తం అందజేయడం లో ముందువరుసలో ఉం దన్నారు. ఈ జీ20 సదస్సు ద్వారా ప్రాంత, కుల, మత, బాషలకు అతీతంగా ప్రపంచానికి మార్గదర్శనం వహిస్తుందన్నారు. మిగిలి న వక్తలు వసుదైక కుటుంబకం ప్రాముఖ్యతను వివరించారు ఈకార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి వెంకటరమణయ్య, నారాయణస్వామి, భరణినాద్‌రెడ్డి, సంధ్య, చంద్రబాబు, సురేష్, రాధాకష్ణ ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 148 బస్తాలు రేషన్ బియ్యం పట్టివేత

గాలివీడు .ఫిబ్రవరి23 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని పెద్దూరు రోడ్డు ఓ ప్రవేట్ బిల్డింగ్‌లో 148 బస్తాలు (7012 కేజీలు) రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు విజిలెన్స్ మరియు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రెడ్డెప్ప, రామకృష్ణలు తెలిపారు. శనివారం గాలివీడు బస్టాండు పెద్దురు రేషన్ బియ్యం నిల్వ ఉన్న సమాచారం అందుకున్న అధికారులు స్థానిక తహాశీల్దార్ దైవాదీనం, డీటి తిమ్మారెడ్డిలతో కలిసి దాడి చేసి 148 బస్తాలు బియ్యాన్ని స్థానిక పెద్దూరులో ఉండే ఎఫ్ పి షాప్‌కి తరలించి క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

## సీబీఐ ఏకపక్ష విచారణపై వైసీపీ నేతల మండిపాటు

పులివెందుల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :



మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సీబీఐ ఏకపక్ష విచారణ చేస్తోందని పులివెందుల వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పూలంగళ్ల కూడలిలో గువారం సీబీఐ ఏకపక్ష విఆరణ తీరుపై వారు మండిపడ్డారు. టీడీపీకి అనుకూలంగా సీబీఐ పనిచేస్తోందని ఆరోపించారు. వైసీసీ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డి, వేల్పుల రామలింగారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటి ఛైర్మన్ గోటూరు చిన్నప్ప, తదితరులు మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై ఉద్దేశపూర్వకంగా బురదజల్లుతూ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ చెప్పినట్లు సీబీఐ విచారణ సాగడం చాలా బాధాకరం అని, సీబీఐ విచారణ అధికారిపై అందరిలోను అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. అలాగే బలవంతంగా తప్పుడు స్టేట్‌మెంట్స్ ఇవ్వాలని వివేకా పీఏ క్రిష్ణారెడ్డిని, కువైట్ గంగాధర్‌రెడ్డిని, ఉదయ్‌కుమార్‌లను సీబీఐ బెదిరింపులకు గురి చేసిందన్నారు. అసత్య స్టేట్‌మెంట్స్ ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో కొన్ని పత్రికలను అడ్డుపెట్టుకుని టీడీపీ నేతల కల్పితాల ఆధారంగా సీబీఐ విచారణ సాగుతుండటం దారుణమన్నారు. నిజాలను బయటకు తీయాల్సిన సీబీఐ అధికారులే ఒక వ్యక్తిని టార్గెట్ ఏస్తూ విచారణ చేయడం తగదన్నారు. వివేకా రాసినట్టు చెబుతున్న లేఖని సీబీఐ ఎందుకు దాస్తోందని, లేఖ ఆధారంగా విచారణ ఎందుకు చేపట్టలేదని వారు ప్రశ్నించారు. ఒక అపద్దాన్ని పదే పదే చెప్పి ప్రజలను నమ్మించాలి అనుకోవడం సీబీఐ మూర్ఖత్వమే అన్నారు. ఇప్పటికైనా సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా సాగాలని వారు డిమాండ్ చేశారు. కడిగిన ముత్యంలా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ కేసు నుండి బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడిరమణ, పార్నపల్లె కిషోర్, చంద్రమౌలి, వీరారెడ్డి, భూపాల్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె మల్లయ్య కొండలు అగ్నికి ఆహుతి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె నియోజకవర్గ సమీపంలోని ప్రసిద్ధ మల్లయ్య కొండ, సాదు కొండ, ఇనుము కొండలు గురువారం అగ్నికి ఆహుతయ్యాయి. దశాబ్దాలుగా ఈ మల్లయ్య కొండల్లో తరచు బోధతో పాటు వనమూలికలు, విలువైన కలప, లక్షలాది మూ గ జీవాలకు ఆహారం అందించే జీవ కొండలుగా నిలవడం అందరికీ తెలిసిందే. గత కొంత కాలంగా మల్లయ్య కొండలు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కుటుంబ కృషితో మల్లయ్య కొండకు రోడ్డు, ఆలయ పునిర్నార్మాణం, కొండలో నూతన పుష్కరిని, ఫారెస్ట్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల వసతి గృహాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ పనుల నిర్వహణకు మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నేడు మల్లయ్య కొండలు రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రాలుగా నిలవడం గత శివరాత్రి పర్వదినానికి లక్షలాది మంది భక్తులు స్వా సేవకు తరలి రావడమే నిదర్శనం. వారు చేసిన సేవకు కొండలు అగ్నికి ఆహుతి అవడం స్థానిక భక్తులు, ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా మల్లయ్య కొండ దేవాదాయశాఖ ఫారెస్ట్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరుతున్నారు.